సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



బీఆర్‌ఎస్‌లో 'సొసైటీ' చిచ్చు

బషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ నేతల మధ్య నావంద్గీ సొసైటీ చిచ్చు రగిలించింది. శనగల కొను'గోల్‌మాల్' ఇందుకు కారణం. 8లో▸



నీళ్లపల్లి ఏకాంబర రామ లింగేశ్వర ఆలయం

న్యూస్‌రీల్

తాండూరు జొన్న-1 రకం ఆవిష్కరణ



జొన్నపంటపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాండూరు రూరల్: స్థానిక వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో తాండూరు జొన్న 1(ఎస్‌వీటీ68) రకం విడుదల చేశామని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ ఇన్‌చార్జి శాస్త్రవేత్త శేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బెల్కటూర్‌లో తాండూరు జొన్న 1 రకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఈ రకం జొన్న విత్తనాలు విత్తుకుంటే ఎకరాకు ఏడు క్వింటాళ్లతో పాటు నాణ్యమైన చొప్ప వస్తుందన్నారు. రైతులు జొన్నపంటను సాగు చేసుకోవాలని సూచించారు. సమాజంలో ప్రతి నలుగురిలో ఒకరు షుగర్‌తో బాధపడుతున్నారని, వారికి జొన్నరొట్టె దివ్యౌషధమని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.సుజాత, యమున, ఏడీఏ రుద్రమూర్తి, ఏఓ రజిత, సర్పంచ్ వడ్డె మదన్‌మోహన్, ఉప సర్పంచు నాగరాజ్, ఏఈఓలు ఉన్నారు.

దప్పు దరువుల్లో కళాకారుల విన్యాసాలు



డప్పులు దద్దరిల్లే.. దిక్కులు పిక్కటిల్లే

మోమిన్‌పేటలో గురువారం డప్పుల దరువు పోటీలు కనువిందుగా సాగాయి. ది లైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్ ప్రారంభించారు. పోటీల్లో ఎనిమిది గ్రూపులు పాల్గొని ప్రేక్షకులను అలరించాయి. అంతరించిపోతున్న డప్పు వాయిద్యాన్ని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇదని నిర్వాహకులు తెలిపారు.

– మోమిన్‌పేట

ఒక్క ఎకరమైనా పారిందా?

- ఎక్కడపాయె 'పాలమూరు ఎత్తిపోతల'
- హామీలన్నీ బూటకమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

పరిగి: జిల్లాకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ ఆరోపించారు. సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. గురువారం మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌లో నిర్వహించిన బూత్‌స్థాయి స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు నీరందిస్తామని చెప్పి ఒక్క ఎకరానికైనా నీరందించారా అని ప్రశ్నించారు. జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పి మరింత వెనక్కి నెట్టారన్నారు. తప్పుడు హామీలు ఇచ్చిన కేసీఆర్ ఇప్పుడు ఏముఖం పెట్టుకుని జిల్లాలకు వస్తారని ప్రశ్నించారు. అనంతగిరిని వైద్యఖిల్లాగా మారుస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. జిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

జీవన్గీ.. పిలుస్తోంది

- నేటి నుంచి మహాదేవ లింగేశ్వరస్వామి ఉత్సవాలు
- నాలుగు రోజులపాటు వేడుకలు
- భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా కుస్తీపోటీలు

బషీరాబాద్: మహాశివరాత్రి ఉత్సవాలకు శైవ క్షేత్రాలు సర్వంగా సుందరంగా ముస్తాబయ్యాయి. భక్తులు ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో ముక్కంటి సేవలో తరించనున్నారు. మండల పరిధిలోని జీవన్గీ మహాదేవలింగేశ్వరాలయం, నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం, నవాంద్గీ సంగమేశ్వరాలయాలు సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పేరుగాంచిన జీవన్గీ మహాదేవలింగేశ్వర స్వామి జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి.

ప్రత్యేక పూజలు ఇవీ..

ఉత్సవాలు ఈ నెల 20 వరకు కొనసాగుతాయి. మొదటి రోజు స్వస్తి పుణ్యాహవచనం, ధ్వజారోహణ నాంది సమారాధన, నవగ్రహహోమం, దేవతాపూజ, వెండి పల్లకీ సేవ చేపడతారు. 18న ఆలయంలో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, లింగోద్భవ సమయం వరకు శివపురాణకథ కాలక్షేపం, తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండ మహోత్సవం నిర్వహిస్తారు. 19న ఆలయం ఎదుట ఉన్న కాగ్నానదిలో ఉదయం ఎడ్లబండ్ల పరుగుపందెం పోటీలు, మధ్యాహ్నం 3.15 గంటలకు శివపార్వతుల కల్యాణం, అనంతరం స్వామి వారి రథోత్సవ కార్యక్రమాలు జరుగుతాయి. చివరి రోజు సోమవారం మహదేవలింగేశ్వర స్వామివారి కలశం వేలం పాట జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



జీవన్గీలోని మహాదేవలింగేశ్వరుడు

అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

జీవన్గీలో జాతర చివరి రోజు నిర్వహించే అంతర్రాష్ట్ర కుస్తీ పోటీల్లో 150 మందికి పైగా కుస్తీవీరులు పాల్గొననున్నారు. కాగ్నానది ఇసుక తిన్నెలపై నిర్వహించే ఈ పోటీలను తిలకించేందుకు భారీగా జనాలు తరలివస్తారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులతో సత్కరిస్తారు.

క్లుప్తంగా

న్యాయం జరిపిస్తా

శివస్వాముల కుటుంబ సభ్యులను పరామర్శించిన బండి సంజయ్



శివస్వాముల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బండి సంజయ్

తాండూరు టౌన్: రిమాండులో ఉన్న యాలాల మండలానికి చెందిన పలువురు శివస్వాముల కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పరామర్శించారు. ఈమేరకు గురువారం పరిగి నియోజకవర్గంలోని రూఫ్‌ఖాన్ పేట్‌లో జరిగిన ప్రజాగోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌కు విచ్చేసిన ఆయనను శివ స్వాముల కుటుంబ సభ్యులు కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. శివ స్వాముల రిమాండుకు సంబంధించిన ఘటనను వారు ఆయనకు వివరించారు. శివ స్వాములకు న్యాయం జరిగేలా చూస్తామని, అధైర్య పడవద్దని వారికి భరోసా ఇచ్చారు. కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్, యాలాల మండలాధ్యక్షుడు మహిపాల్ వారితో ఉన్నారు.

దైవ సన్నిధిలో ఉంటే మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



ఎమ్మెల్యే ఆనంద్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అశోక్

మర్పల్లి: ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండలంలోని పట్లూర్‌లో నూతనంగా నిర్మించిన హన్‌మాన్ మందిరంలో జెడ్పీటీసీ మధుకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ గంట పాటు దేవుని సన్నిధిలో ఉంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ అశోక్ ఎమ్మెల్యేని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయుడు రమేష్ మిత్ర, ప్రధాన కార్యదర్శి రాచన్న, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో యాత్ర

శివలింగాలు.. శాంతి సందేశాలు

మహాశివరాత్రిని పురస్కరించుకుని వికారాబాద్‌లోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం శివలింగాల ప్రదర్శన, శాంతియాత్ర వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా వాహనాలపై శివలింగాలను ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మల్లికార్జున భవనం వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ మధు అక్కయ్య ప్రజలను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

– అనంతగిరి



శివలింగాల శోభాయాత్ర

పేదలను ఆదుకుంటాం

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

దోమ : పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటామని డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గంజిపల్లి తండాలో నిరుపేద కుటుంబీకుడు రాంనాయక్ అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో బాధితుడి ఇంటికివెళ్లి పరామర్శించారు. తక్షణం ఆర్థిక సహాయం కింద రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేదలకు తాను అనునిత్యం అందుబాటులో ఉంటూ ఆదుకుంటానని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, ఎంపీటీసీల ఫోరం కుల్కచర్ల మండల అధ్యక్షుడు రాంలాల్ నాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, శివకుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

నీట మునిగి బాలకార్మికుడు మృతి

ధారూరు: నీట మునిగి బాల కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కేరెళ్లి గ్రామ సమీప ఊరకుంటలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట్ జిల్లా కేంద్రానికి చెందిన మహేశ్, అజయ్, శంకర్(14) గొర్రెల కాపరులు. ధారూరు మండలం కేరెళ్లి గ్రామానికి గొర్రెల మందతో వచ్చారు. మధ్యాహ్నం గొర్రెలకు నీరు తాగించేందుకు సమీపంలోని ఊర కుంటకు తీసుకెళ్లారు. వీరిలో శంకర్ అనే బాలుడు స్నానం చేసేందుకు నీటిలోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. గమనించిన అజయ్ మరోచోట గొర్రెలు మేపుతున్న అన్న తిప్పన్న లింగప్పకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. చిన్న తిప్పన్న అక్కడికి చేరుకుని ఇతరుల సాయంతో శంకర్‌ను నీటిలోంచి బయటకు తీశాడు. అప్పటికే బాలుడు చనిపోయాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.



శంకర్ మృతదేహం

బాల కార్మికుడిగా..

పాఠశాలకు వెళ్లి చక్కగా చదువుకోవాల్సిన బాలుడు గొర్రెల కాపరిగా మారి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లిదండ్రులు బాలుడిని గొర్రెల యజమాని వద్ద జీతానికి ఉంచినట్లు తెలిసింది. అయితే గొర్రెల యజమాని బాలుడిని పనిలో పెట్టుకోవడం వల్లే ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడని పలువురు పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు.

చెట్టును ఢీకొన్న డీసీఎం

డ్రైవర్ మృతి, మరో 8 మందికి గాయాలు

మర్పల్లి: రోడ్డు పక్కన ఉన్న చెట్టును డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తున్న 8మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మర్పల్లి పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ కథనం మేరకు.. బంట్వారం మండలం రొంపల్లికి చెందిన జన్ముల రాములు రెండు నెలల నుంచి రైతుల వద్ద పత్తి కొనుగోలు చేసి డీసీఎం వ్యాన్‌లో మార్కెట్‌కు తరలించేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం రొంపల్లి నుంచి సంగారెడ్డి జిల్లా సదాశివపేట్‌కు వెళ్లాడు. అక్కడ కొనుగోలు చేసిన పత్తిని వాహనంలో లోడ్ చేసేందుకు కూలీలను తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో పట్లూర్ దాటిన తరువాత డ్రైవర్ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ అడివప్ప(40) అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎంలో ఉన్న 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పత్తి కొనుగోలు చేసేందుకు కూలీలను తీసుకుపోతున్న జన్ముల రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

అఫ్రీన్ బేగంకు డాక్టరేట్



తాండూరు టౌన్: పట్టణానికి చెందిన యువతి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. జిల్లాలో ఉర్దూ మీడియంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన తొలి యువతిగా రికార్డు సాధించారు. అఫ్రీన్ బేగం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో ఉన్నత విద్యనభ్యసించారు. ఇన్వెస్ట్‌మెంట్ బిహేవియర్ ఆఫ్ గవర్నమెంట్ సెక్టార్ ఎంప్లాయీస్ – విత్ రిఫరెన్స్ టు తెలంగాణ అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. జనవరి 24న మనూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండీ సాదత్ షరీఫ్ పర్యవేక్షణలో వైవా పూర్తి చేసుకొని, డాక్టరేట్ పొందారు. అఫ్రీన్ బేగంను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సహచరులు అభినందించారు. ప్రస్తుతం అఫ్రీన్ బేగం తాను డిగ్రీ చదివిన తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే కామర్స్ అతిథి అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

‘వక్ఫ్’ భూములనూ వదలని అక్రమార్కులు

కోట్లు విలువ చేసే భూమి స్వాహా



రాకంచర్ల రెవెన్యూ పరిధిలోని వక్ఫ్ బోర్డు భూమి

పూడూరు: రోజురోజుకూ రియల్ భూమ్ పెరిగిపోతుండడంతో కొందరు రియల్టర్ల కన్ను వక్ఫ్ భూములపై పడింది. కోట్ల విలువైన భూమిని గద్దల్లా తన్నుకుపోతున్నారు. వివరాల్లో వెళితే.. మండలంలోని రాకంచర్ల రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 10లో 4.39 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. దీన్ని గతంలో అసూర్ ఖానా కోసం రాకంచర్లకు చెందిన బాబుమియాకు వక్ఫ్ బోర్డు అధికారులు ఇచ్చారు. బాబుమియా చనిపోవడంతో ఆ భూమి అతని భార్య గౌసియాబేగం పేరిట విరాసత్ అయ్యింది. గౌసియా బేగం అందులోని 2.39 ఎకరాల భూమిని ఖానాపురం చంద్రకళకు 2019లో విక్రయించింది. విషయం తెలుసుకున్న మైనార్టీ స్థానిక నాయకుడు సాదక్అలీ అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 10లో 4.39 ఎకరాల వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూమిగా నిర్ధారించి మెమో ఇచ్చారు. సమాచార హక్కు చట్టం ద్వారా అది వక్ఫ్‌భూమి అని తేల్చారు. ఇదిలా ఉండగా ఇట్టి భూమిని రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేయరాదని గతంలో విధులు నిర్వహించిన తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా ఆ భూమిని ఖానాపురం చంద్రకళ డిసెంబర్ 29, 2022లో దేవరి రాఘవేందర్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేసింది. రెవెన్యూ అధికారుల అండదండలతో ఈ తంతు సాగిందని మైనార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆ భూమి విలువ రూ. 8 కోట్లకు పైగా ఉందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో 22ఏ రిజిస్టర్ అయిన వక్ఫ్ బోర్డు భూమిని అధికారులు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని వారు ప్రశ్నించారు.

రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు

రాకంచర్లలోని 2.39 ఎకరాల భూమిని దేవరి రాఘవేందర్‌రెడ్డి అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి భూమి ఆన్‌లైన్‌లో పట్టారకం ఉండడంతో రిజిస్ట్రేషన్ జరిగింది. రాకంచర్ల గ్రామ సర్వే నంబర్ 10లో 4.39 ఎకరాలు వక్ఫ్‌బోర్డు భూమి అని తర్వాత తెలిసింది. అందులో 2.29 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బ్లాక్‌లో పెట్టేల చర్యలు తీసుకుంటున్నాం.

– మోహన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్

చర్యలు తీసుకోవాలి

తప్పుడు వివరాలతో వక్ఫ్ బోర్డు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. పని ఒత్తిడిలో ఉన్న అధికారులను తప్పుతోవ పట్టించి ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. అందిరికీ అందుబాటులో ఉండి పనులు చేస్తున్న అధికారులను బలిచేస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

– పెంటయ్య, డీడీసీ కార్యదర్శి

బీఆర్‌ఎస్‌లో ‘సొసైటీ’ చిచ్చు!

- చైర్మన్ టార్గెట్‌గా ‘పట్నం’ వర్గం ఆరోపణలు
- ‘శనగల కొనుగోల్‌మాల్’లో పాత్రపై అనుమానాలు
- రైతులకు బాసటగా అధికారులకు వరుస ఫిర్యాదులు
- ఆరోపణలు అవాస్తవమన్న ‘పైలెట్’ వర్గం
- అధికార పార్టీలో రంజుగా రాజకీయం



అక్రమాలపై విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు

బషీరాబాద్: అధికార పార్టీ నేతల మధ్య నావంద్గీ సొసైటీ చిచ్చు రగిలించింది. ‘శనగల కొనుగోల్‌మాల్’లో అధికార పార్టీకి చెందిన సొసైటీ చైర్మన్ పాత్రపై అదే పార్టీ నేతలు విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ‘పైలెట్’ వర్గంలో కొనసాగుతున్న చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డిని టార్గెట్ చేసిన ‘పట్నం’ వర్గీయులు రైతులతో కలిసి అధికారులకు వరుస ఫిర్యాదులు చేస్తున్నారు. ఇంటా బయటా ప్రత్యక్ష ఆరోపణలు గుప్పిస్తున్నారు. శనగలు అమ్ముకోవడానికి సొసైటీకి వచ్చిన రైతులను నిలువునా దోచుకున్నారని, వారికి బాసటగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యే వర్గీయులు ఈ ఆరోపణలను తిప్పికొట్టలేక సతమతమవుతున్నారు. తాండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయుల మధ్య చాలా కాలంగా ఆధిపత్య పోరు సాగుతోంది. అయితే ఈ మధ్యే నియోజకవర్గంలోనే ఏకైక శనగల కొనుగోలు కేంద్రం బషీరాబాద్‌లోని నావంద్గీ సొసైటీలో ప్రారంభమైంది. ఈ సొసైటీ చైర్మన్‌గా రోహిత్‌రెడ్డి వర్గానికి చెందిన వెంకట్‌రామ్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే కేంద్రంలో జరిగిన శనగల కొనుగోల్‌మాల్‌లో సొసైటీ సీఈఓనే అక్రమాలకు పాల్పడ్డారని పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అయితే చైర్మన్‌కు తెలియకుండా సీఈఓ వెంకటయ్య భారీ ఎత్తున శనగల దోపిడీ ఎలా చేస్తారు..? గతంలో వరి ధాన్యం కొనుగోళ్లలోనూ ఇదే విధంగా అవినీతి చేశారని ఎమ్మెల్సీ వర్గం నేతలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి రైతులతో కలిసి సొసైటీలో జరిగిన అక్రమాల్లో ఎవరెవరి హస్తం ఉందో తేల్చాలని రైతులతో కలిసి పోలీసులకు, తహసీల్దార్‌కు, సొసైటీ ఉన్నతాధికారులకు రాతపూర్వక ఫిర్యాదులు చేశారు. మరోవైపు చైర్మన్‌ను అన్యాయంగా శనగల అక్రమాల కేసులో లాగేందుకు పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనంతయ్య గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. తన పాత్ర ఉంటే తాను పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేస్తానని చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి నిలదీస్తున్నారు. తనను రైతుల్లో అప్రతిష్ట పాలు చేయడానికి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డుతున్నారు. మరోవైపు సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరుపాలంటే ఎమ్మెల్యే వర్గీయులు ఎందుకు బుజాలు తడుముకుంటున్నారని ఎమ్మెల్సీ వర్గీయులు అటాక్ మొదలు పెట్టారు. ఈ వ్యవహారం ముదిరి పాకాన పడడంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తమ ఆధిపత్యం కోసం తమ వర్గీయులను వెనకుండి ప్రోత్సహిస్తున్నారని రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా సొసైటీలో జరిగిన అవినీతి అధికార పార్టీలో పెనుదుమారం రేపబోతుంది. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు సొసైటీ అవినీతి వ్యవహారంలో అధికార పార్టీ నేతల కొట్లాట ప్రధాన అస్త్రంగా మారబోతోంది.

చిరుధాన్యాల సాగు విస్తరించాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్



మేకవనంపల్లిలో జొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్ తదితరులు

మోమిన్‌పేట: చిరు ధాన్యాల సాగును పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మేకవనంపల్లిలో రైతు వేదికను సందర్శించి, రైతు సాగు చేస్తున్న జొన్న పొలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జొన్న, కొర్రలు, ఊదలు, రాగులు, గోధుమలు, సజ్జలు, అరికెలు, సామలు తదితర చిరు ధాన్యాలను రైతులు సాగు చేయాలన్నారు. చిరు ధాన్యాలను మరింత ప్రోత్సహించాలని ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిందన్నారు. తక్కువ నీటి వసతి ఉన్న ప్రాంతాలలో చిరుధాన్యాలను సాగు చేయాలన్నారు. మండలంలో ప్రస్తుత పంటల సరళిని బట్టి నేలలో ఉన్న సహజ సిద్ధభాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా జీవ ఎరువులను ఉపయోగించాలన్నారు. అలాగే నత్రజని ఎరువులను దఫాలుగా వేయాలన్నారు. దీంతో పంటకు చీడ పీడల బాధ తగ్గుతుందని ఆయన తెలిపారు. జొన్న, మొక్కజొన్న సాగు చేస్తున్న పంట వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టరు అంజిరెడ్డి, ఏఓ జయశంకర్, ఏఈఓ చంద్రిక, రైతు నర్సింహులు తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

మొయినాబాద్: ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న డ్రైవర్ అదే ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. వెనుకనుంచి అతివేగంతో వచ్చిన కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ట్రాలీ అతని పైనుంచి వెళ్లడంతో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట్ జిల్లా దామరగిద్ద మండలం గద్వ గ్రామానికి చెందిన కిందిగెరి రాములు(42) మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వలస వచ్చాడు. పట్టణంలోని కిరణ్ వే బ్రిడ్జ్ నిర్వాహకుడు కృష్ణారెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం డస్ట్ లోడుతో ట్రాక్టర్‌ను మొయినాబాద్ నుంచి హిమాయత్‌నగర్ తీసుకెళ్తుండగా మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద వెనుకనుంచి అతివేగంతో వచ్చిన కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ రాములు ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ట్రాలీ అతని పైనుంచి దూసుకెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మహాశివరాత్రికి ఆలయం ముస్తాబు

నేటి నుంచి రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తులు



బుగ్గ రామలింగేశ్వరాలయం

అనంతగిరి: వికారాబాద్ పట్టణం సమీపంలో ఉన్న బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. శివరాత్రిని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. త్రేతా యుగాంతమున దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం అవతరించిన శ్రీరామచంద్రుడు రావణ సంహారం అనంతరం బ్రహ్మ హత్యదోష నివృత్తికై అడుగడుగునా శివలింగాలు స్థాపించినట్లు చరిత్ర చెబుతోంది. ఇందులో భాగంగా అనంతగిరి అడవుల్లో సాక్షాత్తు శ్రీరామచంద్రునిచేత ప్రతిష్ఠించిన శివలింగం బుగ్గ రామలింగేశ్వలింగం. భక్తుల కొంగు బంగారంగా నిత్యం పూజలందుకుంటున్న బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఈ సారి కూడా ఘనంగా జరగనున్నాయి. ఆలయ ఆవరణలో పుష్కరిణి ఉంది. గోముఖం నుంచి నిత్యం నీటి ధార వస్తుంది.

ప్రత్యేక పూజలు

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యహవచనం, రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు ఉంటాయని ఆలయ అర్చకులు తెలిపారు. శనివారం ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 5.30గంటలకు నుంచి 8గంటల వరకు ప్రత్యేక అభిషేకాలు, 8 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు స్వామి వారి దివ్య దర్శనం, రాత్రి 10 గంటల నుంచి ప్రత్యేక సామూహిక భజనలు, జాగరణ, 12.30గంటలకు లింగోద్భవ సమయంలో మహా రుద్రాభిషేకంతో పాటు తెల్లవారు జాము వరకు భజన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను వికారాబాద్ నుంచి బుగ్గ వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.

పలు శివాలయాల్లోనూ..

మండలంలోని పులుసుమామిడి సమీపంలో వెలిసిన పార్వతీపరమేశ్వరుల గుట్టపై వెలిసిన ఆలయం, పీరంపల్లి, పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయాలన్నీ మహా శివరాత్రి కోసం ముస్తాబవుతున్నాయి.



శివలింగం

సమస్యల పరిష్కారానికి కృషి

హుడాకాంప్లెక్స్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో టీఎస్ పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి ఎన్నికల కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెన్న కేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులతో పాటు పీఈటీ భాషా పండితులకు పదోన్నతులను చేయిస్తామని తెలిపారు. మారుమూల ప్రాంతాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు సరైన విద్య అందించలేకపోతున్నామని, కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా ఉపాధ్యాయులను నియమించి పేద విద్యార్థులకు సరైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.